కథానిక

# గృహప్రవేశం

బి. ఈశ్వరరావు

"ఏమండోయ్"

"........"

"మిమ్మల్నే... నా గొడవ ఎవరికి కావాలి? కాస్త మాటన్నా వినిపించుకోండి... మిమ్మల్నే. లేవండి" అంటూ లక్ష్మి పెద్ద కేకలు పెట్టుకుంటూ వచ్చి నేను కప్పుకున్న దుప్పటి తీసింది.

"ఏమిటి గోల! ఏమొచ్చింది పొద్దున్నే... ఎందుకలా అరుస్తావు..." అని అడిగాను లేచి కూర్చుని.

"మీకు గొడవగానే కనిపిస్తుంది. అలా చూడండి! ఆవిడ ఎలా అడిపోసుకుంటోందో."

"ఎవరావిడ? ఏమనీ?"

"ఇంకా ఎవరున్నారు! ఆ ఇంటి ఆవిడ రత్తమ్మగారే! ఇక్కడ చీదారనీ, ఇక్కడ నీళ్లు పోశారనీ, అక్కడ చెంబు పెట్టారనీ ఒకటేతిట్లు. వినండి... ఆ శాపనార్థాలు."

"అవుతే నన్నేమి చెయ్యమన్నావు?" అని అడిగాను.

"అవును మరి? మీరు ఎంత గోల జరుగుతున్నా చీమైనా కుట్టినట్లుండదు. ఏదో రెండు మెతుకులు నోట్లో వేసుకొని ఆఫీసులో కూర్చుంటారు. పొద్దస్తమానం ఈ పిల్లల్తో చచ్చీచెడీ చాకిరీ చేసేదానికి తెలుస్తుంది. చాకిరీకి తోడు ఈ పైపోరు ఒకటి! నేనుమటుకు వేగలేను. నన్ను పొమ్మంటే నేపోతాను" అని పెద్ద లెక్చరిచ్చింది కోపంతో.

"ఇంతకీ నన్నేమి చెయ్యమన్నావు?"

"వెంటనే ఇల్లు ఏదైనా వెతకండి" అని సలహా ఇచ్చింది లక్ష్మి.

"మీరు తల్చుకుంటే అవనిపని అంటూ వుండదు. ఈ రోజుకు సెలవుపెట్టి ఇంటికోసం గట్టిగా ప్రయత్నం చెయ్యండి" అని కాఫీ అందిస్తూ అన్నది. నన్ను పొగిడింది కాబట్టి నాకు కాస్త హుషారు ఎక్కింది. తప్పకుండా ఈరోజు ఇల్లు మారాలి అని బయలుదేరాను.

కాళ్లు అరిగిపోయేటట్లు సాయంకాలందాకా వూరంతా తిరిగాను. కాని ఎక్కడా ఖాళీలేదు. ఈ రోజు మనకు అవసరం వచ్చిందని ఎవరన్నా ఇల్లు ఖాళీచేసి ఇస్తారా ఏమిటి? పిచ్చిమాట! నిరాశతో ఇంటిదారి పట్టాను. ఎవరో బండి నిండా సామాన్లు వేసుకొని పైన మంచాలు వేసుకొని పోతున్నారు. నేను ఆ బండి దగ్గరకు పరిగెత్తాను. ఎవరో ఒక బిళ్ళబంట్రోతు బండి వెనకాల లాంతరు పుచ్చుకుని నడుస్తున్నాడు. కచ్చితంగా ఇల్లు మారినరకమే అనుకొని ఆ అబ్బాయి దగ్గరకు వెళ్ళి, "ఎవరబ్బాయి ఇల్లు ఖాళీచేసింది?" అని నెమ్మదిగా అడిగాను.

"మా అయ్యగోరు. తాసిల్దారుగారు మీకు తెలవదా?" అని అన్నాడు.

"ఎక్కడినుంచి ఖాళీ చేశారో కాస్త చెప్పు బాబూ" అని అడిగాను.

"ఆ రంగయ్యగారింట్లోంచి" అనివిసుగ్గా సమాధానమిచ్చాడు.

వెంటనే రంగయ్యగారింటికి పరిగెత్తుకుని వెళ్ళాను. ఇల్లు ఇంకా పూర్తిగా ఖాళీ అవలేదు. రంగయ్యగారిని కలుసుకుని ఇల్లు చూసుకున్నాను చాలా బాగుంది. ఇక అద్దె విషయం అడిగా.

"పూర్వం ఈ ఇంటికి నలభైఐదు రూపాయలిచ్చారండీ! కానీ ఈ రామారావు ఉన్నాడు చూశారూ, ఇప్పుడు ఖాళీచేసిన తాసిల్దారు నా మిత్రుడు. అందుకని ఆయనకు ఐదు రూపాయలు తక్కువకిచ్చాను. కాని ఆయన కచేరీ దగ్గరనీ, పిల్లల బడులకు దగ్గరనీ అక్కడ ఏదో ఇల్లుచూసుకున్నాడు. ఆయన చాలా......" అని ఇంకా ఏదో చెప్పబోయాడు.

"ఇంతకీ నన్ను ఎంత ఇమ్మన్నారో చెప్పండీ?" అని ఆయనమాటకు అడ్డువచ్చి అడిగాను.

"రామారావు ఇచ్చినంతే ఇవ్వండి. అంతకు చిల్లిగవ్వతగ్గదు. కావలిస్తే ఇల్లు ఇప్పుడే తాళం వేసుకువెళ్ళండి." అని అన్నాడు.

"నలభైరూపాయలా? రెండుగదులు ఒకవంట ఇంటికి"అని అన్నాను.

"మీకిష్టమైతేనే చేరండి. లేకపోతే ఇబ్బంది లేదు. మా కోడలు పురిటికివస్తుంది. అప్పుడు ఎలాగో నాకు ఇల్లు కావాలి" అని లోపలికి పోయాడు.

గబగబా ఇంటికి చేరుకున్నా. వీధిగుమ్మంలో అడుగుపెట్టాను లోపల ఏదో పెద్దగల్లంతు జరుగుతోంది. రత్తమ్మగారు (మా ఇంటి ఆవిడ) గబగబా నాముందుకురకువచ్చి

"సిగ్గున్న మొగాడివి అయితే వెంటనే ఇల్లు ఖాళీచెయ్యవయ్యా! ఖాళీచెయ్యకపోతే రేపొద్దున నీ చెంబూ తప్పాలా బైట పెట్టిస్తా"అని అన్నది.

నేను భరింపలేకపోయాను. వెంటనే ఇంట్లోకి వచ్చాను.

"సిగ్గా? సెరమా? మొగాడువాకిట్లోకివచ్చారో లేదో మీదకడి కొట్టబోయింది. ఆడదట! ఆడది. అందుకనే పెళ్ళిఅయిన మూడోనాడే మొగుడు చచ్చి ఊరుకున్నాడు"అని మా ఆవిడఅంటోంది.

"అబ్బా ఆడవారికెందుకింత నోరు ఇచ్చావు భగవంతుడా"అని మనస్సులో అనుకొని లక్షిని పిలిచాను.

"ఎందుకొచ్చిన గోల! నువ్వు ఊరుకో"అని లక్ష్మిని నివారించాను.

"మీరుకాబట్టి ఊరుకున్నారు. ఇంకో మొగాడయితే ఆ చెంపా, ఈచెంపా కొట్టిపంపేవారు" అని అంది.

"అబ్బ ఊరుకుందూ."

"ఇంతకీ ఎక్కడన్నా ఇల్లుదొరికిందా?" అని ఆదుర్దాగా అడిగింది.

"ఊరంతా వెతికాను. కాని ఎక్కడా...."

"దొరకలేదా?"

"నా మాటపూర్తికానీ...ఎక్కడా దొరక లేదు. చివరికి మాంచి ఇల్లు దొరికింది."

"ఆ! నిజంగానా! అద్దె ఎంత?"

"నలభైరూపాయలు."

"అయ్యబాబురే! నలభై రూపాయలా? ఎలా ఇవ్వగలమండీ. ఈ ఇరవైరూపాయలు ఇవ్వటమే కష్టంగా ఉంటే నలభై ఎక్కడినుంచి ఇస్తా మండీ? మనకి వచ్చే వందలో పాలు, పెరుగు వగైరాలన్నీ పోను పిల్లల జీతాలుగట్టి నలభై ఎలా ఇవ్వగలము?" అని అంది.

"అంతా భగవంతుని దయ. ముందరపోయి ప్రవేశించుదాం పద. నెమ్మదిగా చవక ఇంట్లో ప్రవేశించుదాం...సరేనా?" అని లక్ష్మిని అడిగాను.

"సరే"అని తన ఇష్టాన్ని వెలిబుచ్చింది.

"అయితే సామాన్లు సర్దు త్వరగా"అని బండి పిల్చుకురావటానికి బైటకు పోయాను.

* * *

సామాన్లు అన్నీ కొత్త ఇంటికి చేర్చేటప్పటికి రాత్రి పదిగంటలైంది. హోటలునుంచి క్యారేజిలో తెచ్చిన అన్నంతో మేము పిల్లలూ భోజనంచేసి పడుకున్నాము.

తెల్లవారిలేచి సామాన్లు సర్దేటప్పటికి టైం అయింది ఆఫీసుకు. భోజనంచేసి వాకిట్లో కూర్చున్నాను. ఎవరో బంట్రోతులాగున్నాడు నెత్తి మీద ఒకబుట్ట పెట్టుకొచ్చి నా ముందరపెట్టి, "అయ్యగారు వస్తున్నారండీ, తమకు ఇది ఇవ్వమని చెప్పారు" అని ఆ బుట్టను నాకిచ్చి వాకిట్లోకి వెళ్ళాడు. నేను పిల్లలనుపిల్చి ఆ బుట్ట లోపలికి తీసుకుపొమ్మన్నాను. "ఎవరో పెద్ద మనిషి కాబోలు వస్తున్నారు జాగ్రత్త! గోల చెయ్యకండి" అని ఇంట్లో చెప్పి కాస్త కుర్చీ సర్ది కూర్చున్నాను. కర్ర తిప్పుకుంటూ మీసాలు దిద్దుకుంటూ ఒకాయన ఎవరో ప్రవేశిస్తూ వాకిట్లో ఉన్న ఆ యజమాన్ని "అయ్యగారు ఉన్నారా?" అని అడిగాడు.

"చిత్తం! లోపలున్నారండీ" అని వాడు జవాబు ఇచ్చాడు.

"నమస్కారమండీ! రండి! కూర్చోండి" అని ఆ పెద్దమనిషికి కుర్చీ చూపించాను.

ఇంతలో లోపల పెద్దగోల బయలుదేరింది. నేను లోపలికివెళ్లి చూతును గదా పిల్లలంతా ఆ పండ్ల బుట్టమీదపడి "నాకు ఇది కావాలంటే నాకిది కావాలి" అని గోలచేస్తున్నారు. వారిగోలను కొంతవరకు తగ్గించి పెద్దమనిషి దగ్గరకు వచ్చాను ఆయన మరలా మీసాలు దిద్దుకుంటూ

"రామారావుగారు లేరండీ?" అని అడిగాడు నా గుండెల్లో రాయిపడ్డట్లయింది.

"ఐ ఆమ్ సారీ, తాసిల్‌దార్ రామారావు గారు నిన్న సాయంకాలం ఈ ఇల్లు కాళీచేసి వెళ్లారండి. ఆయనకుబదులు మేమీఇంట్లో నిన్ననే ప్రవేశించాము" అని అన్నాను.

వెంటనే ఆ పెద్దమనిషి లేచి "ఒరే వెంకా? వెంకా!" అంటు రెండుమార్లు అరిచాడు బైట మన్న జవాను వచ్చాడు.

"పైగా అయ్యగారు ఉన్నారనికూడా చెప్పే వేరా! వెధవా?" అని అరిచాడు పాపం అమాయకుడిమీద "వాడు నన్ను చూపుతూ వీరుకాదా బాబూ" అని అడిగాడు.

"వెధవా! కాదురా! రామారావుగారు నిన్ననే ఈ ఇల్లు ఖాళీచేసి వెళ్లారట. బుట్ట ఏదిరా?" అని అడిగాడు.

నా గుండెల్లో రాయి పడ్డట్లయింది నిలువునా నీరు అయిపోయాను.

"లోపలకు పంపానండీ" అని అన్నాడు.

"వెధవా! పోయి తీసుకురా" అని ఆ పెద్దమనిషి ఆజ్ఞాపించాడు. నేనులోపలికి వెళ్లిచూచాను. ఇంకాఏముంది అక్కడ. ఖాళీ బుట్టమాత్రం మిగిలింది. "కొంప మునిగిందిరా భగవంతుడా" అనుకొని ఆ పెద్దమనిషి దగ్గరకు వెళ్లి వినయపూర్వకంగా.

"బాబూ పిల్లలుకలవాడిని. మీ బుట్ట ఖాళీ అయింది. కావలిస్తే" అని మాట పూర్తిగా చెయ్యలేదు. చరచరా ఆ పెద్దమనిషి వెళ్లిపోయాడు.

"ఇంట్లో ప్రవేశించిననాడే ఏమిరా భగవంతుడా! ఈ సంఘటన" అని అనుకొని కుర్చీలో కూలబడ్డాను.

---

(7-వ పేజీ తరువాయి)

సహజంగా క్షీణించింది. కనుక ప్రాంతీయ సంస్కృతి వికసించడానికి. సామాన్య ప్రజలు తమ భాషల్లో రాజ్యాంగ వ్యవహారాలను చక్కపెట్టుకోగలిగిన పరిపాలనా యూనిట్లుగా రాష్ట్ర విభజన చేయించదలచుకొన్నప్పుడు తప్ప నెహ్రూ వంటి బాధ్యతగల నాయకులు భాషా రాష్ట్ర సిద్ధాంతాన్ని విమర్శించడంలో అర్థంలేదు.

*     •     *

## పరిపాలకుల పొల్లుమాటలు

పరిపాలనాభారాన్ని మోసే పరిపాలకులు తరుచుగా మాట్లాడుతూ ఉండే పొల్లుమాటలు రాకతప్పదు. ఎవ్వరైనా ఒకవ్యక్తికి ఒక ముఖ్యమైన పదవిఇస్తే అధ్యక్షపదవులతోటీ, ఉపన్యాసాలతోటీ ఆయన ప్రాణాలను తీసేస్తారు. ప్రజాస్వామ్యం విస్తృతమైనప్పుడు బహు సామాన్యులుకూడా పరిపాలకులవుతారు. అమాంతంగా జనులు ఆయనలో అన్ని ప్రతిభలు ఉన్నట్లు భావించుకుంటారు. సాహిత్య గోష్ఠిలో ఆయన మాటాడవలసింది. సంగీతగోష్ఠిలో ప్రసంగించవలసిందే. శాస్త్రవిషయమైన గోష్ఠిలలో ఆయన పాల్గొనవలసిందే. ఒకటేమిటి అనేక గౌరవ సంఘాలకు అధ్యక్షుడై తెలిసీ తెలియని విషయాలు అనేకం మాట్లాడాలసొస్తూంది. ఈ జబ్బు ప్రజలకెంత వ్యాపించిందో, ఈఅధికారాలకొచ్చే పాలకుల్లోకూడా అంత వ్యాప్తిచెందింది. ఈ వికారానికి దాసులయ్యేవాళ్ళల్లో మన ప్రధాని ముఖ్యుడు. సంగీతం, సాహిత్యం, భరతనాట్యం, విజ్ఞానశాస్త్రం, వేదాంతం ఒకటేమిటి చతుఃషష్టి కళలమీద ఆయనమాట్లాడే స్థితిలో పడ్డాడు పాశ్చాత్యదేశాల్లో ఇలాంటి బాధ్యత గలవారిని ప్రజలు చాలా సక్రమంగా వాడుకుంటూరు. కాని మన దేశంలో వారిని చాకచేసే అలవాటులో పడ్డాం. సామాన్యంగా ఏ విజ్ఞానవేత్తల సభలోనో మాట్లాడవలసొస్తే కాస్తంత వారిని పొగడకతప్పదు. పొగడడంలోనూ, ఇతరులకంటె మీరే గొప్పవారని అనకా తప్పదు. ఈ వ్యాసంగంలో ఒక సమావేశంలో చెప్పిన విషయాన్ని మరొక సమావేశంలో కాదనడమూ సంభవిస్తుంది. ఈ దురలవాటును తప్పించడానికి మన ప్రధాని ప్రయత్నించకపోవడం శోచనీయం.

*     *     *

## పరిపాలకులంత ముఖ్యులు కారు

అలాంటి సందర్భంలోనే మన ప్రధానమంత్రి నెహ్రూ ఇటీవల దేశపరిపాలమీద విరుచుకు పడ్డాడు. రాజకీయపరిపాలకులు అంత ముఖ్యులు కారనీ, కానివారన్నింటికీ తయారవుతారనీ ఆయన విమర్శ. ఈ విమర్శను బహుశా ఆయన